# తెల్లవారుఝాము పాఠాలు

**కప్పగంతుల సత్యనారాయణ**

**శోభనమైన కొత్తలో బి.ఏ. పరీక్ష పాసయిన కబురు తెలిసి గోపాలరావూ, అతని భార్యాయే కాకుండా, రెండువైపుల బంధువులు కూడా పొంగిపోయారు. చచ్చి చెడి చదివినవాడు గోపాలరావే అయినా, "ఇంతకీ అన్నపూర్ణ అదృష్టం" అంటూ, అదృష్టం మాత్రం భార్యకి అంటగట్టారు బంధువు లందరూను. శోభనపు శృంగారంలో మునిగితేలుతూ ఉన్న గోపాలరావుకి తను పరీక్ష పాసయిన వార్త సహజంగా సంతోషాన్ని కలిగించినా, ఓ విధమైన బెంగను కూడా కలిగించింది.**

ఇంకముందు ఏం చెయ్యటం? బి.ఏ. పరీక్ష అయింది కదా అని ఏ ఉద్యోగానికైనా ప్రయత్నిద్దామా అంటే, ఎంత ప్రయత్నించినా ఏమీ దొరికే ఆశ కనపడలేదు. అంచేత కమ్మగా భార్యతో కాపరం చేస్తూ కూచుంటే ...

బాగానే ఉంటుంది కానీ, అతని నాన్న మాత్రం అందుకు ఒప్పుకోలేదు. "చేతనయితే ఏదైనా ఉద్యోగం ఇప్పుడిమటుకున సంపాదించు. లేకపోతే, ప్లీడరీకో, డాక్టరీకో చదువు ఆరంభించు!" అని ఖండితంగా చెప్పేశాడు. గోపాలరావు చదువుకుంటానంటే, అందుకయ్యే ఖర్చు ఎంతయినా సరే, భరించడానికి అతడు సిద్ధంగా ఉన్నాడు.

అలాంటప్పుడు, చదవడానికి ఎవడికి ఇష్టముండదు? చచ్చిచెడి చదివినా, ఒక్క ముక్క కూడా ఒంటబట్టని శుద్ధ మొద్దుకి కూడా చదువుకుందాము కులాసాగా అని ఉంటుంది. ఇహ కొంచెం తెలివయినవాడూ, శ్రద్ధ గలవాడూ అయిన గోపాలరావు చదువుకోడానికే పూనుకున్నాడంటే ఆశ్చర్య మేమీ లేదు.

మళ్ళీ ఒక సందేహం వచ్చింది. ప్లీడరీకి చదవడమా, డాక్టరీకి చదవడమా? ప్లీడరీ అయితే రెండేళ్ళలో అయిపోతుంది. డాక్టరీ అయిదేళ్ళు పడుతుంది. ప్లీడరీ అయితే, పార్టీలు తన ఇంటికి వస్తారు. బోలెడు డబ్బు సంపాదించవచ్చును. తెలివితేటలుంటే, సర్ అల్లాడి కృష్ణస్వామయ్యరంత గొప్పవాడు కావచ్చును. డాక్టరీ అయితే డబ్బు వచ్చినా పాడు చాకిరీ చెయ్యాలి. కాస్తో కూస్తో ప్రతిష్ఠ వచ్చినా, పదవి రాదు. ఇలా ఇన్ని ఆలోచనలతో, చివరికి ప్లీడరీకి చదవడానికే నిశ్చయించుకున్నాడు. అంతవరకూ ధోరణి బాగానే వెళ్ళింది. కానీ ఇంకో సందేహం వచ్చింది. వెళ్ళితే, చదువుకి చెన్నపట్నం వెళ్ళాలి. కానీ కొత్తగా కాపురానికి వచ్చి, శృంగార రసాన్ని రుచి చూపిస్తూ ఉన్న అన్నపూర్ణ మాట తలచుకొనేటప్పటకి - మళ్ళీ అతనికి ఆలోచనలు ఆరంభమయ్యాయి. అన్నపూర్ణను తీసుకుని వెళ్ళడమా, మానడమా?

వదిలిపెట్టి ఉండడం దుస్సాధ్యంగా తోచింది. తీసుకు వెడితే కాపురం పెట్టాలి. చదువు సరిగ్గా సాగుతుందో, సాగదో?

"మరి నేను సెలవు లయ్యాక చెన్నపట్నంలో చదువుకు వెడుతున్నాను. నువ్వు కూడా వస్తావా, ఇక్కడే ఉంటావా?" అని అన్నపూర్ణను అడిగాడు. అన్నపూర్ణకి ఇంకా అతని దగ్గర సిగ్గు పూర్తిగా వదలలేదు. తలవంచి, అతని నడుము చుట్టూ చేతులు పెనవేసి, "నే నొక్కదాన్నీ ఇక్కడ ఉండనా?' ' అంది.

"ఏం? మీ అమ్మా, మీ నాన్నా, చెల్లెళ్లూ, అన్నయ్యా - ఇంతమంది ఉండగా -"

"ఏమో, మిమ్మల్ని విడిచి ఇంక ఒక్క నిమిషమైనా ఉండలేను, బాబూ!" అంటూ కళ్ళు కొంచెం పైకెత్తి ఏం చెపుతాడో అన్నట్టు అతని కళ్లకేసి చూసింది. ఆ చూపుకి అతడు పరవశుడయాడు. ఆమె చెప్పినదంతా నిజమే ననిపించింది. నిజంగా ఆమె తనను వదలిపెట్టి ఒక్క నిమిషం



కూడా ఉండలేదు. అలాంటి ప్రియురాలిని వదిలిపెట్టి తను మాత్రం ఒక్క నిమిషమేనా ఎలా ఉండగలడూ?

అన్నపూర్ణను తీసుకుని వెళ్లవలసిందేనని నిశ్చయించుకున్నాడు. తన తండ్రితోటీ, ఆమె తండ్రితోటీ ఈ సంగతి చెప్పి, ఇద్దరినీ ఒప్పించాడు.

కావలసిన సామానులన్నీ సర్దుకుని, అవసరమైనంత డబ్బూ తీసుకుని, భార్యా భర్త లిద్దరూ పట్నం ప్రయాణమయారు. దసరా సెలవులు ఇవ్వగానే మళ్లీ వస్తామని తన తండ్రికీ, ఆమె తండ్రికీ; ఉత్తరాలు రాస్తూండమని ఆమె తండ్రికీ, తను ఉత్తరం రాయగానే కావలిసిన డబ్బు పంపుతూ ఉండమని తన తండ్రికీ చెపుతూ ఉండగా రైలు కదిలింది. వియ్యంకు లిద్దరూ ఇంటిదారి పట్టారు. రైలు చెన్నపట్నం దారి పట్టింది.

రైలు బయలుదేరింది మొదలు దారి పొడుగునా, ప్రతి స్టేషనులోనూ, అరటిపండ్లో, నారింజపండ్లో, ద్రాక్షపండ్లో, ఏవో ఒకటి కొనుక్కుంటూ, తింటూ, కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ వీళ్లు కాలం గడిపేశారు. వీళ్లు రాజమండ్రిలో బండి ఎక్కింది మొదలు చెన్నపట్నంలో దిగేవరకూ కూడా ఆ పెట్టెలో ఎక్కిన వాళ్లందరి కళ్లూ వీళ్లమీదే ఉన్నాయి.

రైలు దిగగానే హోటలుకి వెళ్లి, సామానంతా అక్కడ పడవేసి, సాయంత్రం కాగానే ఇద్దరూ కలిసి ట్రిప్లికేన్‌లో ఇల్లు వెతకడానికి బయలుదేరారు. రిక్షాలో ఎక్కి కూచున్నాక, గోపాలరావు ఇలా అన్నాడు - "చూడు, మనం వంట, వడ్డనా పెట్టుకుని తూగలేము. హాయిగా కారియరులో పెట్టించి హోటలు నుంచి తెప్పించుకుందాము. పగలు నేను కాలేజీకి వెళ్లినప్పుడు నువ్వు పత్రికలూ, నవలలూ చదువుకుంటూ ఉండుగాని.''

సంతోషంతో ఒప్పుకుంది అన్నపూర్ణ. ఒకే ఒక పెద్ద గదీ, గదికి వెనుకవైపు చిన్న వరండా ఉన్న మేడమీది భాగం అద్దెకి తీసుకున్నారు. ఆ గదిని చదువులకీ, పడకకీ ఉపయోగించుకుందుకూ; ఆ వరండాను భోజనాలకీ, స్నానాలకీ ఉపయోగించుకుందుకూ నిర్ణయించి, అడ్వాన్సు ఇచ్చివేసి ఆ రాత్రికే వచ్చి ఆ భాగంలో చేరారు.

మరునాడు గోపాలరావు కాలేజీకి వెళ్లి, జీతం కట్టేసేసి, కొనవలసిన పుస్తకాలన్నీ కొత్తవి కొనుక్కుని, సాయంత్రం ఇంటికి వచ్చాడు. సాయంత్రం గోపాలరావూ, అన్నపూర్ణా ఇద్దరూ బీచికి వెళ్లారు. ఎనిమిది గంటలదాకా బీచిలో షికారు చేసి, అయ్యరు తెచ్చిన భోజనం తినేసి, కాంపుకాటుమీద కమ్మగా కౌగిలించుకుని పడుకున్నారు.

మరునాటినుంచీ గోపాలరావు శ్రద్ధగా స్కూలుకు వెళ్లడం ఆరంభించాడు.

వారం రోజులు మామూలు ప్రకారమే గడిచాయి. కాలేజీలో మాత్రం పాఠాలు గబగబా చెప్పుకుని పోతున్నాడు ప్రొఫెసరు.

ఈ వారంరోజులలోనూ ఒక్కరోజైనా గోపాలరావు పుస్తకాన్ని ముట్టిన పాపాన పోలేదు. కానీ, అతను మొదటి నుంచీ కూడా చాలా శ్రద్ధగల మనిషి. ఏ రోజు పాఠాలు ఆ రోజున చదవడము అతనికి చిన్నప్పటినుంచి అలవాటు. అలా చదవకపోతే పరీక్షలముందు చాలా కష్టపడి చదవవలసి వస్తుందనీ, ఒకవేళ చదివినా పరీక్ష పాసుకావడం అనుమానమే నని అతనికి భయం.

అంచేత ఒక వారం రోజులు గడిచిన తరువాత ఈ విషయంలో ఏదో ఆలోచన చేసుకోవా లనుకున్నాడు. ప్రతిరోజూ రాత్రి పదిగంటలవరకూ, తెల్లవారుఝామున నాలుగుగంటలకి లేచి తెల్లవారే వరకూ చదువుదామని నిశ్చయించుకున్నాడు.

## తెల్లవారుఝాము పాఠాలు

శ్రీ కప్పగంతుల సత్యనారాయణ (క.స.) జననం **1916**. తెలుగు, ఇంగ్లీషు పత్రికా రంగాలలో అనుభవం గడించారు. ఆంగ్ల దినపత్రిక 'మెయిల్'లో న్యూస్ ఎడిటర్‌గా పనిచేశారు. 'మాణిక్యం, ఎవరికి వారేనా, తెల్లవారుఝాము పాఠాలు, సెలవు, రుణవిముక్తి కథాసంపుటాలు; ప్రపంచ దర్శిని, కబుర్లు, మన మతములు - ప్రవక్తలు వీరు వెలువరించిన పుస్తకాలు. వస్తు వైవిధ్యం, శిల్ప వైచిత్రి వెలార్చే కథా సంచయం, సరస శృంగారం కమ్మని కబుర్లుగా సాగే కథా కథనం వీరి ప్రత్యేక ముద్ర.

కొత్త కాపురంలోని చెక్కిలిగింతలకు అక్షరరూపం ఈ గల్పిక - పాఠకులకు మా దీపావళి కానుక.

కారియర్‌లో వచ్చిన భోజనాన్ని ఇద్దరూ పెట్టుకుని తిన్నారు. అన్నపూర్ణ గిన్నెలన్నీ సర్దుకుంటూ ఉండగా, గోపాలరావు చదువుకి కూచున్నాడు. ఒక పేజీ చదివినట్టున్నాడు. అన్నపూర్ణ గదిలోకి వచ్చింది. సాయంత్రం తలలో పెట్టుకున్న సన్నజాజి పూల వాసన ఆ గదిలో ఉన్న నిర్జీవమైన వస్తువులకి కూడా ఉద్రేకాన్ని కలిగించింది. బీచి వైపు నుంచి తెరలు తెరలుగా రివ్వుమని వస్తూన్న గాలి ఆ ఉద్రేకానికి దోహద మిచ్చింది. గోపాలరావు అన్నపూర్ణ వైపు చూశాడు. అన్నపూర్ణ మాత్రం గోపాలరావు తనవైపు చూస్తున్న సంగతి గమనించకుండానే, గోడకి తగిలించి ఉన్న అద్దం దగ్గరికి వెళ్లి చెంపలూ, చెక్కిళ్లూ సవరించుకుని, మెల్లిగా వెళ్లి పక్కమీదికి ఒరిగింది. గోపాలరావు చేతిలో ఉన్న పుస్తకం మూసివేసి, "ఇప్పుడేం చదువు? హాయిగా తెల్లవారుఝామున చదువుకోవచ్చు!'' అంటూ అలారం గడియారం తీసి మూడున్నరకి అలారం పెట్టి, ఒక్క దూకున అన్నపూర్ణ పక్కన చేరాడు.



గణగణమంటూ సరిగ్గా మూడున్నరకి గడియారం అలారం కొట్టేసింది. వెంటనే నిద్ర లేచాడు గోపాలరావు. లేస్తూనే లైటు వేసుకుని కూజాలో ఉన్న చన్నీళ్లతో మొహం కడుక్కుని చదువుకి కూచున్నాడు.

పుస్తకం రెండుచేతులతోటి తెరుస్తూ అటు పక్కమీద పడుకుని ఉన్న అన్నపూర్ణకేసి చూశాడు. రాత్రి భర్తతో గడిపిన ఆనందం వల్లా, చీకూ చింతా, కల్మషమూ లేని నిర్మలమైన హృదయం వల్లా హాయిగా నిద్రపోతోంది అన్నపూర్ణ. ఆమె పెదవులు నిద్రలో కూడా కమ్మని చిరునవ్వును ప్రదర్శిస్తున్నాయి. నిద్రలో కూడా ఆమె ముఖం అత్యంత ఆహ్లాదకరంగా, ప్రసన్నంగా ఉంది. జుట్టు బాగా రేగి, ముందరివైపున ముంగురులు, నుదుటి మీద ఉంగరాలలో చుట్టుకుని ఉన్నాయి. జాజిపూల వాసన గుమ్మనిపిస్తోంది ఇంకానూ. ఆ తియ్యటి వాసనా, పద్మంలాంటి ఆ ముఖమూ చూసి భ్రమపడి తుమ్మెదలు వచ్చి వాలాయా అనిపిస్తున్నాయి ఆ ముంగురులు.

గోపాలరావుకి ఇక చదువుమీద ధ్యానం పోలేదు. తీసిన పుస్తకాన్ని తీసినట్టే బల్లమీద పెట్టి, అన్నపూర్ణ మొహంమీద మొహం పెట్టి గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. "ఏమిటండీ ...'' అంటూ అన్నపూర్ణ మెల్లిగా కళ్లు తెరిచింది.

"మళ్లీనీ ...'' అంటూ లైటు ఆర్పివేశాడు.

ప్రతిరోజూ ఇలాగే జరగడం ఆరంభమైంది. పగలంతా రాత్రి చదువుకుందా మనుకోవడమూ, రాత్రి అయ్యేనరికి తెల్లవారుఝామున చదువుకుందాములే, ఇవ్వాళకి లేకపోతే ఏమనుకుంటూ మళ్లీ ... ఇలా వారం రోజులు జరిగింది. అన్నపూర్ణకి ఆశ్చర్యం వేసింది. పైగా రాత్రి పదకొండున్నరదాకానూ, తెల్లవారుఝామున మూడున్నర నుంచీ మేలుకోవలసి వచ్చినందువల్ల పాపం, ఆమెకి నిద్ర కూడా సరిగా చాలడంలేదు.

ఓ రోజున మామూలు ప్రకారం రాత్రిపూట అయిన తరువాత గోపాలరావు అలారం పెట్టబోతూ ఉండగా అన్నపూర్ణ "ఏమండీ! పదకొండున్నర అయిందా ఇప్పుడు. మళ్లీ తెల్లవారుఝామున ఏమిటండీ? నాకు ఈ పదిరోజుల నుంచీ నిద్ర బొత్తిగా చాలటంలేదండీ! ఏమండీ, ఆ తెల్లవారుఝాము పాఠాలు కూడా ఇప్పుడే చదివెయ్యండీ ...!'' అంది.

తెల్లబోయిన అతని మొహం లైటు తెలుపులో మరింత తెల్లబడింది.